
మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా టమోటాలు

టమోటా 'ధర'హాసం

● రూ.700 పలికిన 15 కిలోల బాక్స్

సోమల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా టమోటా రైతుల పంట పండుతోంది. అనూహ్యంగా ధర పైపైకి ఎగబాకడంతో వీరి ముఖాన ఆనందం వెల్లివిరిసింది. సోమవారం అనూహ్యంగా 15 కిలోల బాక్సు ధర రూ. 700కి చేరుకుంది. ఆదివారం రూ. 450 పలికింది. రెండు రోజుల వర్షాలకు రైతులు టమోటాలను కోయడం లేదు. దీంతో మార్కెట్‌కు తక్కువగా పంట ఉత్పత్తులు వచ్చాయి. డిమాండ్‌కు సరిపడే టమోటాలు లేకపోవడంతో పోటీ పెరిగి ధరలు పుంజుకున్నాయి. మదనపల్లె మార్కెట్‌లో 22 కేజీల బాక్సు రూ.1100, కోలారు మార్కెట్‌లో 15కిలోల బాక్సు రూ.700, చిన్నమండ్యంలో రూ.750, ములకలచెరువులో రూ.800, పుంగనూరు లో 15కిలోల బాక్సు రూ.700కు చేరుకుంది. ధరలు పెరుగుతుంటే మరోపక్క వర్షాలకు తోటలు దెబ్బతింటున్నాయి. ఉన్న కొద్ది పంటను కాపాడుకోవడానికి రైతులు చీడపీడల నివారణకు మందుల పిచికారీ చేస్తున్నారు. ఏప్రిల్‌లో నాట్లు వేసిన పొలాల్లో ఇప్పుడు దిగుబడులు వస్తున్నాయి.

పుంగనూరులో కిలో టమోటా రూ.41

పుంగనూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం కిలో టమోటా ధర రూ.41 పలికింది. మార్కెట్‌లో రైతుల నుంచి మొదటి రకం రూ.41, రెండోరకం రూ.38, మూడో రకం రూ36 చొప్పున కొనుగోలు చేశారు. వ్యాపారులు 538.86 మెట్రిక్ టన్నుల టమోటాలను కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించారు. ఆదివారం మొదటి రకం రూ. 28.70, రెండో రకం రూ.26.70, మూడో రకం రూ. 24.70 చొప్పున ధర పలుకగా ఒక్క రోజులోనే కిలో రూ.11 పెరగటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


షియాల రక్తతర్పణం - పీర్ల ఊరేగింపు



షియాల రక్తతర్పణం

గంగాధరనెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి):గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లెలో షియా ముస్లింలు సోమవారం అజాదారి మాతమ్ (రక్తతర్పణం) నిర్వహించడంతో పాటు పీర్లను ఊరేగించారు.మొహర్రం పండుగ తరువాత 25వరోజైన ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు షియా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.శతాబ్దాల క్రితం యజిద్ అనే పాలకుడి చేతిలో బలైపోయిన ఇమామ్ హుస్సేన్,ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, అనుచరుల త్యాగాలను స్మరించుకుంటూ షియాలు బాధాతప్త హృదయంతో పీర్లను ఊరేగించారు. తరువాత పిల్లలు, యువకులు, పెద్దలు వారిశరీరాలపై పదునైన బ్లేడ్‌లు, చాక్‌లతో కొట్టుకుంటూ రక్తం చిందించారు. అనంతరం పలువురికి అన్నదానం చేశారు.

డీసీసీబీ విభజన!



తిరుపతికి కొత్త సహకార బ్యాంకు

చిత్తూరు బ్యాంకు పరిధిలోనే అన్నమయ్య జిల్లా శాఖలు

జిల్లా	బ్యాంకు శాఖలు	సింగిల్ విండోలు
చిత్తూరు	20	37
తిరుపతి	14	23
అన్నమయ్య	06	15
మొత్తం	40	75

చిత్తూరు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వందేళ్లకు మించి చరిత్ర కలిగి సహకార రంగంలో తన ప్రత్యేకతను చాటుకుంటున్న చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) విభజనకు లోనుకానుంది.రాష్ట్రవ్యాప్తంగా 13 డీసీసీబీలుండగా ప్రాథమికంగా చిత్తూరు, కర్నూలుతో పాటు ఇతర ప్రాంతాల్లోని నాలుగు వెరసి ఆరు డీసీసీబీల విభజనకు ప్రభుత్వం ఆలోచిస్తోంది.తొలిదశలో ఆరు డీసీసీబీలను 12గా విభజించి,వాటిపనితీరును పరిశీలించాక మిగిలిన ఏడు డీసీసీబీలను విభజించనున్నట్లు సమాచారం.

2022 ఏప్రిల్‌లో జిల్లాల పునర్విభజన జరిగింది. కానీ అప్పట్లో డీసీసీబీ, డీసీఎంఎస్ (జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ) విభజన జరగలేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోనే డీసీసీబీ, సీడీసీఎంఎస్ కొనసాగుతున్నాయి.పరిపాలనా సౌలభ్యం కోసం డీసీసీబీలను పునర్వ్యవస్థీకరించాలని సహకారశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాకొక డీసీసీబీని ఏర్పాటు చేసే దిశగా అడుగులేస్తోంది. ప్రస్తుతం చిత్తూరులో కొనసాగుతున్న డీసీసీబీ పరిధిలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని 75 సింగిల్ విండోలు(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు)న్నాయి, 40 బ్యాంకు శాఖలున్నాయి. తిరుపతి, అన్నమయ్య జిల్లా కేంద్రాల్లో డీసీసీబీ తరపున డీజీఎం స్థాయి అధికారులకు కార్యాలయం ఏర్పాటు చేశారు.అక్కడి కలెక్టర్లు జరిపే జిల్లా స్థాయి సమావేశాలకు ఆయా అధికారులు హాజరవుతున్నారు. ప్రస్తుత చిత్తూరు డీసీసీబీ పరిధిలో 75 సింగిల్ విండోలుండగా, జిల్లాలవారీగా చిత్తూరులో 37, తిరుపతిలో 23, అన్నమయ్యలో 15 విండోలు కొనసాగుతున్నాయి. బ్యాంకు శాఖలవారీగా చిత్తూరులో 20, తిరుపతిలో 14, అన్నమయ్యలో 6 బ్యాంకు శాఖలున్నాయి.చాలా సంవత్సరాలుగా ఎన్నికలు జరక్కపోవడంతో మొన్నటి వరకు త్రిసభ్య కమిటీలతో సింగిల్ విండోలు, సెవెన్‌మెన్ కమిటీతో డీసీసీబీ, సీడీసీఎంఎస్ కొనసాగాయి. తాజాగా ప్రభుత్వం సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలను వేయగా, డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జులను చైర్మన్లుగా నియమించింది. త్వరలో సహకార సంస్థలకు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉంది. డీసీసీబీలను విభజించి ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుంది, లేదా ఉమ్మడి జిల్లా డీసీసీబీలకు ఎన్నికలు జరిపి, ఆ తర్వాత విభజిస్తే ఎలా ఉంటుంది అని ప్రభుత్వం ఆలోచిస్తోంది.అయితే సహకార శాఖ ఉన్నతాధికారుల సంకేతాల ప్రకారం ఎన్నికలకు ముందే తొలి, మలి దశల్లో డీసీసీబీలను విభజించే అవకాశం ఉందని తెలుస్తోంది.

తిరుపతికి కొత్త డీసీసీబీ ఏర్పాటుపై కసరత్తు

డీసీసీబీ విభజన జరిగితే తిరుపతి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఏర్పాటుకు ఇప్పటినుంచే చర్యలు ప్రారంభిస్తే ఎన్నికల నాటికి ఒక కొలిక్కి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. అన్నమయ్య జిల్లాను మాత్రం చిత్తూరు డీసీసీబీలోనే కొనసాగించనున్నారు. విభజన జరిగితే తిరుపతి జిల్లాకు కొత్తగా అధికారులు, ఉద్యోగుల సర్దుబాట్లు, కార్యాలయ భవనాలు, సమావేశ మందిరాలు ఏర్పాటు చేయాల్సివుంటుంది. కాగా తిరుపతిలో డీసీసీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు కోసం రెండువేల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించాలని ఆ జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను బ్యాంకు అధికారులు కోరినట్లు సమాచారం.

25 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 25 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా పుంగనూరులో 36.2, అత్యల్పంగా శ్రీరంగరాజపురంలో 1.2 మిమీ వర్షం పడింది. మండలాలవారీగా.. పెద్దపంజాణిలో 35.2, రొంపిచెర్లలో 26.4, పులిచెర్లలో 19.8, వెదురుకుప్పంలో 19, యాదమరిలో 10.2, సదుంలో 9.2, పెనుమూరులో 8.2, సోమలలో 7.6, రామకుప్పంలో 6.8, చౌడేపల్లెలో 6.2, బంగారుపాళ్యంలో 5.2, గంగవరం, బైరెడ్డిపల్లెలో 4.6, వి.కోటలో 4.4, పూతలపట్టులో 3.8, తవణంపల్లెలో 3.6, పలమనేరులో 3.4, చిత్తూరు అర్బన్, ఐరాలలో 3.2, కార్వేటినగరం, గంగాధరనెల్లూరులో 2.8, గుడిపాలలో 2.2, శాంతిపురంలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

మామిడి రైతుల ఖాతాలకు

సబ్సిడీ సొమ్ము రూ.150 కోట్లు త్వరలో జమ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటివరకు సేకరించిన తోతాపురి మామిడికి ప్రభుత్వం కిలోకు రూ.4చొప్పున అందించనున్న సబ్సిడీ సొమ్ము రూ.150 కోట్లు త్వరలోనే రైతుల ఖాతాలకు జమచేయడం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో మామిడి పంటను వివిధ ఫ్యాక్టరీలకు తరలించిన రైతుల జాబితా సమగ్రనివేదికపై అధికారులతో సమీక్షించారు. సబ్సిడీ సొమ్ము దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత మండల అధికారులపై ఉందన్నారు. జూన్ నెలవరకు సేకరించిన మామిడికి సబ్సిడీ జూలైలో, జూలైలో సేకరించిన మామిడికి సబ్సిడీ ఆగస్టులో రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామన్నారు. 2.25 లక్షల మెట్రిక్ టన్నులతో కూడిన 22,435 మంది రైతుల వివరాలను మండలస్థాయి బృందాలకు అందిస్తామన్నారు. ఆ వివరాలను మండల వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు గ్రామస్థాయి అధికారులతో వెళ్లి క్షేత్రస్థాయిలో రైతుల వద్ద వాటిని సరిచూసుకోవాలన్నారు. అక్కడే రైతులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, ఈ-క్రాప్ పంటలను పరిశీలించాలని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు తరలించిన మామిడి రైతులకు కూడా ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందని ప్రకటించారు. అట్టి జాబితాను వేరుగా సిద్ధం చేయాలన్నారు. రొంపిచెర్ల, పులిచెర్ల, బంగారుపాళ్యం, యాదమరి, సదుం, పలమనేరు మండలాల అధికారులతో రైతుల వివరాలపై కలెక్టర్ ఆరాతీశారు. జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్, ఉద్యానశాఖ డీడీ మధుసూదన్, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, పట్టుశాఖ జేడీ పద్మావతి, మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్‌తో పాటు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేటినుంచి పీ4పై గ్రామసభలు

చిత్తూరు అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన, స్వర్ణాంధ్ర విజన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పీ4 సర్వేపై ప్రతి వార్డు సచివాలయంలో మంగళవారం నుంచి గ్రామసభలను నిర్వహించాలని కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ చెప్పారు. ఈనెల 25వ తేదీ లోపు వార్డు సచివాలయ పరిధిలో ఇదివరకే ఎంపిక చేసిన బంగారు కుటుంబాల జాబితాను గ్రామసభలో ప్రదర్శించాలన్నారు. ఈ జాబితాపై గ్రామసభలో సోషల్ ఆడిట్ నిర్వహించి మార్పులు, చేర్పులు చేపట్టి అర్హులైనవారితో తుది జాబితాలో సిద్ధం చేయాలన్నారు. గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలన్నారు. వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శులు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సభలను నిర్వహించి.. తుది జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు.

నేడు టీటీడీ బోర్డు సమావేశం

45 అంశాలతో అజెండా తయారు



తిరుమల, జూలై21(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం జరుగనుంది. తిరుమల అన్నమయ్య భవనంలో ఉదయం 10.30 గంటలకు చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన సభ్యులు సమావేశం కానున్నారు. దాదాపు 45 అంశాలతో రూపొందించిన అజెండాపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. ఇందులో ప్రధానంగా టీటీడీలోని కాంట్రాక్ట్ డ్రైవర్లను, విద్యాసంస్థల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడం, తిరుమలలోని పాత భవనాలను నూతన డోనార్ స్కీం కింద పునర్నిర్మించే అంశం, వేద పారాయణదారులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు అందజేసే అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. అలాగే బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న క్రమంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై కూడా చర్చ జరగనుంది. శ్రీవాణి ట్రస్టు ద్వారా వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఆలయాల నిర్మాణానికి పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల అంశంపై కూడా చర్చించి నిర్ణయాలు తీసుకోన్నారు. టీటీడీలో అన్యమత ఉద్యోగుల అంశం ఇటీవల తీవ్రస్థాయిలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.టీటీడీలో దాదాపు వెయ్యి మంది అన్యమత ఉద్యోగులు ఉన్నారంటూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్ వ్యాఖ్యానించడం కలకలం సృష్టిస్తోంది. ఇప్పటికే టీటీడీ ఐదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో పాటు మరి కొందరిపై విజిలెన్స్ విభాగంతో విచారణ చేయిస్తోంది. అయితే పూర్తిస్థాయిలో టీటీడీ నుంచి అన్యమత ఉద్యోగుల తొలగింపుపై మరోమారు చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. అలాగే టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగుల ఇళ్లను విజిలెన్స్ ద్వారా తనిఖీ చేయించి అన్యమతస్తులను గుర్తించేలా బోర్డు తీర్మానం చేస్తామంటూ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రకటన చేశారు. దీనిపై కూడా చర్చ జరగనున్నట్లు తెలిసింది.

అధికారులపై చైర్మన్ అసహనం

ఇప్పటివరకు బోర్డులో చేసిన తీర్మానాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ టీటీడీ బోర్డు చైర్మన్ అధికారులుపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తిరుమలలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం జరుగనున్న నేపథ్యంలో సోమవారం తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్‌తో పాటు ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, వివిధ విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. నూతనంగా పెట్టబోయే అజెండా అంశాలపై చర్చిస్తున్న క్రమంలో ఇప్పటికే తీర్మానం చేసిన వాటి అమలులో ఎందుకు ఆలస్యం చేస్తున్నారంటూ ఈవోపై చైర్మన్ ఆగ్రహించినట్లు తెలిసింది. వ్యక్తిగత అజెండాలు ఎవరికి లేవనీ, పరిపాలనపరంగా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తూ అన్నిటిని ఒక్కొక్కటిగా అమలుచేస్తూ వస్తున్నామని ఈవో కూడా బదులిచ్చినట్లు సమాచారం. కొంతసమయానికే అందరు సర్దుకుని సమావేశాన్ని ముగించినట్లు తెలిసింది.

బీజేపీ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు

చిత్తూరు సెంట్రల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా నూతన కార్యవర్గాన్ని అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు సోమవారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కేవీ చంద్రమోహన్ (పూతలపట్టు), ఎల్.అరుణ, టి.మణివర్మ, జీకే చౌదరి (జీడీనెల్లూరు), కె.రవికుమార్ (చిత్తూరు), వి.రమేష్(నగరి), జిల్లా ప్రధాన కార్యదర్శులుగా అట్లూరి శ్రీనివాసులు (చిత్తూరు), ఎం.లోకేష్ (పుంగనూరు), జి.విజయకుమార్ (పలమనేరు), జిల్లా కార్యదర్శులుగా జీఆర్ ప్రభాకర్ (పలమనేరు), కె.బాబు, టి.జయలక్ష్మి (నగరి), టి.జయచంద్రారెడ్డి (పూతలపట్టు), ఎ.వెంకటరమణ నాయుడు (పుంగనూరు), యు.సత్యభామ (చిత్తూరు రూరల్), వీసీ హరినాయుడు (జీడీ నెల్లూరు) ఎన్నికయ్యారు. సోషల్ మీడియా కన్వీనర్‌గా ఆర్.రాజేష్, ఐటీ కన్వీనర్‌గా డి.మాధురి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వి.యుగంధర్‌రాజు (విజయపురం), ఎస్ఎం మోహన్ (నగరి టౌన్), ఎం.ప్రభాకర్‌నాయుడు (నగరి రూరల్), కె.జగదీష్ రాజు (వడమాలపేట), ఎ.పయణి (తవణంపల్లె), ఎన్‌పీ శివయ్యనాయుడు (బంగారుపాళ్యం), ఎన్.గుణశేఖర్ రెడ్డి (నిండ్ర), పి.బాబు (పుంగనూరు టౌన్), బి.నరేష్ (చౌడేపల్లె), కె.విశ్వనాథనాయుడు (సోమల), ఎం.ఇంద్రాణి (రొంపిచెర్ల), కె.సుజాత (పులిచెర్ల), ఎస్.చలపతినాయుడు(ఐరాల), పి.నందిమాధవ్ (గుడిపాల), ఎస్.సుధాకర్ (పుత్తూరు రూరల్), ఎస్ఆర్ సత్యనారాయణ, పి.రుక్మణిరెడ్డి (చిత్తూరు) ఎన్నికయ్యారు.



జస్టిస్ చంద్రకుమార్ - ఎస్.ప్రసాద్

తిరుమలలో ప్రముఖులు


తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ చంద్రకుమార్, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ప్రాసిక్యూషన్స్ జిల్లా డైరెక్టర్ ఎస్.ప్రసాద్, తిరుపతి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయశేఖర్ ఉన్నారు. కాగా దర్శనం అనంతరం మంత్రి సంధ్యారాణి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా కాపాడాలని స్వామిని కోరుకున్నట్లు చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కోదండరామాలయంలో పవిత్రాల సమర్పణ

తిరుపతి అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో సోమవారం పవిత్రాల సమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుతగా సీతారామలక్ష్మణుల ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కుంభారాధన, హోమం చేపట్టారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేశారు. ఈ సందర్భంగా ధ్రువమూర్తులు, కౌతుకమూర్తులు, స్నపనమూర్తులు, బలిమూర్తులకు పవిత్రాలు సమర్పించారు. అలాగే విష్వక్సేన, ద్వార పాలకులు, భాష్యకారులు, గరుడాళ్వార్, యాగశాలలోని హోమగుండాలు, బలిపీఠం, ధ్వజస్తంభం, ఆలయం ఎదురుగా ఆంజనేయస్వామికి సైతం పవిత్రాలను సమర్పించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు.

సర్వ దర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఓ షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.33 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 87,138

తలనీలాలు సమర్పించినవారు: 30,099

నట కెరటం

అభినయ ఆర్ట్స్ బీఎన్ రెడ్డి

పరిషత్తు పోటీలంటే నిర్వాహకులకు పెద్ద ప్రహసనంతో కూడుకున్న పని. ఆరు నెలలపాటు అనేకమంది కలిసి మోసే భారం.. అలాంటిది ఒకే ఒక్కడు తిరుపతి వేదికగా ఒక నాటక పరిషత్తును పాతికేళ్లుగా నడిపిస్తున్నాడు. ఆ సంస్థ పేరు అభినయ ఆర్ట్స్. ఆ వ్యక్తి పేరు బీఎన్ రెడ్డి. నటన ఆయన ప్రాణం, నటన ఆయన జీవితం. నటనే ఆయన ప్రపంచం. ఆ నిత్య నటనోత్సాహి నడుపుతున్న అభినయ ఆర్ట్స్ రజతోత్సవ వేడుకలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా బీఎన్ రెడ్డి నట, జీవన యాత్ర.. ఆయన మాటల్లోనే..

తిరుపతి, ఆంధ్రజ్యోతి







దర్శకుడిగా సినిమా

దీన్ని చూసిన స్నేహితులు సినిమా చేయమని ప్రోత్సహించారు. తిరుపతి వైద్యులు డాక్టర్ కీర్తి, డాక్టర్ పార్థసారధి నిర్మాతలుగా 'నీతోనే హాయ్‌హాయ్' సినిమాను తీశాం. తెలుగుతోపాటు హిందీలో కూడా రిలీజ్ చేశాం. రెండో సినిమాకు కథను సిద్ధం చేసుకుంటున్నా.

లోహితాసుడిగా తొలి వేషం

మాది నెల్లూరు జిల్లా హసనాపురం. అమ్మానాన్నలకు ఐదుగురు సంతానం. 16 మంది మేనమామలు. ఉమ్మడి కుటుంబం. మా మేనమామలు అందరూ పౌరాణిక నాటకాలు ఆడేవారు. ఒక్కోసారి ఒక నాటకంలో అన్ని పాత్రలూ మా ఇంట్లోవాళ్లే వేసేవారు. స్త్రీ పాత్రలు మాత్రం వేసేవారు కాదు. మా నాన్న రామాయణ, భారతాల గురించి చెప్పేవారు. వీరందరినీ చూస్తూనే పెరిగాను. ఒకసారి మా ఊళ్లో సత్యహరిశ్చంద్ర నాటకం వేయాలనుకున్నారు. అందులో లోహితాసుడిగా నన్ను ఎంపిక చేసుకున్నారు. నాలుగు పద్యాలు నేర్పించి స్టేజి ఎక్కించారు. ఇక అక్కడి నుంచీ నాటకం నాకో వ్యసనంగా మారింది. హార్మోనియం సౌండ్ వినిపిస్తే చాలు బడి ఎగ్గొట్టేసేవాడిని. ఇంట్లో తిడతారని దూలం మీద నక్కి కూర్చుని ఇంట్లో జరిగే రిహార్సల్స్ చూస్తూ ఉండేవాడిని. ఇంటిలో మందలించినప్పటికీ దొంగచాటుగా ఇంటి దూలం ఎక్కి ఆలకించేవాడిని.

అప్పుడెక్కిన స్టేజీ ఇంకా దిగలేదు

నా 14వ ఏట డైరెక్టర్ అయిపోయాను. ఆగస్టు 15 సందర్భంగా స్కూల్‌లో నాటిక వేయాలనుకున్నాం. మా మాస్టారు కామేశ్వరరావు నన్ను పిలిచి 'మనుషులంతా ఒక్కటే' నాటికను ఇచ్చి 'నువ్వే డైరెక్టర్ నాటకామాడించు అన్నారు. అంతే.. అప్పుడు ఎక్కిన స్టేజీ ఇప్పటికీ దిగలేదు.

రంగస్థలం కోసం రిక్షా తొక్కా

మా నాన్న చనిపోయాక కుటుంబ భారం మీద పడింది. వానొస్తేనే వ్యవసాయం. పని వెతుక్కుంటూ నెల్లూరుకు చేరుకున్నా. పగలంతా బేల్దారి కూలీ.. రాత్రిళ్లు రిక్షా తొక్కేవాడిని. ఆ కష్టాన్ని ఇప్పటికీ మరవలేదు. అప్పుడూ నాటకాన్ని వదల్లేదు. ఒక మధురమైన అనుభవం ఏమిటంటే.. కూలీగా నేను ఇటుకలు మోసిన ఇంటికే పాతికేళ్ల తర్వాత అతిథిగా వెళ్లడం. అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శిగా నాటకం నాకు ఆ గౌరవం ఇచ్చింది.

ఆతిథ్యం అందుకున్నా. చేతితో గోడను నెమ్మదిగా తాకుతూ ఆనందబాష్పాలతో నిద్రపోయా. ఆరోజు నా జీవితంలో మరిచిపోలేనిది. 8ఏళ్ల క్రితం అభినయ ఆర్ట్స్ పనిమీద ప్రకాశం జిల్లాకు వెళ్లా. రాత్రి 4 గంటలకు రైలు దిగా. బయటకు రాగానే ఆటో, రిక్షాలు కనిపించాయి. నేరుగా రిక్షా వైపుకెళ్లి నేను వెళ్లాల్సిన అడ్రస్ చెప్పా. కొంతదూరం వెళ్లాక రిక్షావాలాను దిగమని, నేను ఎక్కి రిక్షా తొక్కా. అలవాటు తప్పిందా లేదా అని పరీక్షించుకున్నా. రిక్షా ప్రయాణం సవ్యంగానే సాగింది. తెల్ల దుస్తులతో రిక్షా తొక్కుతుంటే అతను ఆశ్చర్యపోయాడు. గతం చెప్పాక అతని ఆశ్చర్యానికి సమాధానం దొరికింది.

పరుచూరి ప్రోత్సాహంతో సినిమాల్లోకి..

యుక్త వయసులో సాంఘిక నాటికలు విస్తృతంగా వేసేవాళ్లం. కలియుగమా కళ్లుతెరువు, నీతీ నీవెక్కడ, గుండెలు మార్చబడును, ఏక్‌దిన్‌కా సుల్తాన్, పూల రంగడు.. ఇలా ఎన్నో నాటికల్లో కీలక పాత్రలు నావే. 'హంష్‌కాకి' అనే నాటికలో లచ్చిగాడు అనే బిక్షగాడు పాత్ర వేశా. ఆ రోజు సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా వచ్చారు. నాటికలోని నాపాత్ర చూసి అభినందించి, సినీ పరిశ్రమకు రమ్మన్నారు. తొలి సినిమా అవకాశం.. డాక్టర్ భవాని చిత్రంలో. నటుడిగా ఉంటూనే ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా, మేనేజర్‌గా, కంట్రోలర్‌గానూ చేసేవాడిని. జంబలకిడిపంబ, ఇద్దరు పెళ్లాల ముద్దుల పోలీస్, ఒరేయ్ రిక్షా, ఒసేయ్ రాములమ్మ, టాప్‌హీరో, ఆ..ఒక్కటీ అడక్కు...ఇలా వంద సినిమాలకు పైగా ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేశా. దర్శకరత్న దాసరి నారాయణ రావు దగ్గర శిష్యుడిగా ఉండే అవకాశం కొంతకాలం వచ్చింది. తిరుపతి అమ్మాయిని పెళ్లి చేసుకోవడంతో తిరుపతికి వచ్చేశా. ఆ సమయంలోనే గురువు దివంగత డాక్టర్ ఎన్.శివప్రసాద్‌తో సాన్నిహిత్యం ఏర్పడింది. ఆయన దగ్గర పనిచేసే అవకాశం వచ్చింది.

అభినయ ఆర్ట్స్ ప్రస్థానం

సినిమా పరిశ్రమ హైదరాబాద్‌కు మారిన తర్వాత అక్కడ ఇమడలేక తిరుపతికి తిరిగి వచ్చేసి అభినయ ఆర్ట్స్‌ను స్థాపించా. ఒక రోజు కార్యక్రమాలతో మొదలుపెట్టి.. నేడు 9 రోజులపాటు జాతీయ స్థాయి నాటకోత్సవాలను నిర్వహించే దాకా ఎదిగింది. రూ.14వేలతో మొదలుపెట్టిన కార్యక్రమం నేడు పాతిక లక్షలకు చేరింది. ఇదంతా నా వెన్నంటి ఉండే చిరకాల దాతలు, మిత్రుల సహకారం. ముఖ్యంగా నాభార్య యమున.. అతిథులు, కళాకారులకు కడుపునిండా అన్నంపెట్టి పంపుతుంది. కుటుంబ సభ్యులందరూ పనులన్నీ పక్కనపెట్టి పదిరోజుల పాటు మహతిలో కష్టపడతారు. ఆరునెలల పాటు అభినయ ఆర్ట్స్ పనిలోనే ఉంటా.


రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు అందుకుంటున్న బీఎన్ రెడ్డి


గరుడ నాటకోత్సవాలలో ఉత్తమ హాస్యనటుడిగా నూతన ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు

నంది అవార్డు

అభినయ ఆర్ట్స్ స్థాపించాక వేషాలు వేయడం తగ్గిపోయింది. గరుడ నాటకోత్సవంలో శ్రీకృష్ణతులాభారంలో వసంతకుడిగా నటించి ఉత్తమ హాస్యనటుడి అవార్డు దక్కించుకున్నా. రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాలలో విరాట్ పాండవీయంలో ఉత్తర కుమారుడు పాత్రకు బంగారు నంది అందుకున్నా. ఏపీ పోలీస్ శాఖ కోసం ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించడంపై 'మనసంపద' పేరుతో షార్ట్‌ఫిల్మ్ తీశా. ఇందులో విలన్ పాత్ర చేశా.



శ్రీవారి ఆలయానికి మేఘమాల

పచ్చని గుట్టలు.. చల్లని గాలులు.. నీలాకాశం మీద తేలాడుతూ వచ్చిన తెల్లని మబ్బులు.. తిరుమల ఆలయం వెనుక వాలి సేదదీరుతూ భక్తులకు కనువిందు చేశాయి. అఖిలాండం వద్ద నుంచి చూస్తే శ్రీవారి ఆలయానికి ప్రకృతి వేసిన శ్వేతమేఘమాలలా కనిపించింది. పలువురు ఈ దృశ్య నేపథ్యంగా ఫొటోలు దిగారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కనుల పండువగా కుమారస్వామి రథోత్సవం



పురవీధుల్లో రథంపై ఊరేగుతున్న సుబ్రహ్మణ్యస్వామి - తెప్పపై విహరిస్తున్న స్వామివారు

శ్రీకాళహస్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన రథోత్సవం కన్నులపండువగా సాగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామిని రథంపై అధిష్ఠింపజేసి చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. రథంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర హారతులు సమర్పించారు.

నేత్రపర్వంగా తెప్పోత్సవం

శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామిని మొదట అలంకార మండపంలో విశేషంగా అలకరింపజేసి మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య నారద పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. అక్కడస్వామి అమ్మవార్లను తెప్పలపై అధిష్ఠింపజేసి నారద పుష్కరిణిలో పూజలు చేశారు. అనంతరం తెప్పపై విహరిస్తున్న శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పుష్కరిణి వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాల వాడిపోయిందిరా గోవిందా..



మే నెలలో ధరింపజేసిన మాలలు

వాడిన మాలలతో ఆంజనేయస్వామి విగ్రహం

అలిపిరి కాలినడకమార్గంలో ఏడోమైలు వద్ద ఉండే ప్రసన్న ఆంజనేయస్వామి నిలువెత్తు విగ్రహం వాడిన పూలమాలతో దర్శనమిస్తోంది. హనుమజ్జయంతి సందర్భంగా గత మే నెలలో ప్రసన్న ఆంజనేయస్వామికి భారీ పుష్ప, ఆకుమాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత వాటిని తొలగించలేదు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో

ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్లు జైలుశిక్ష

❖ రూ.మూడు లక్షల చొప్పున జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.మూడు లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన మునియప్ప, మంజునాథ్ కొన్నేళ్లుగా శేషాచలం అడవుల్లోకి ప్రవేశించి ఎర్రచందనం చెట్లు నరికి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. 2018లో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేయడానికి ప్రయత్నిస్తుండగా పీలేరు అటవీశాఖ సెక్షన్ అధికారి ఎన్.చిన్నబాబు పట్టుకుని ఫారెస్టు కార్యాలయానికి తీసుకొచ్చారు. విచారించగా వాస్తవాలు అంగీకరించడంతో వారిపై కేసు నమోదు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి విచారణ దశలో ఉన్న ఈ కేసు తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక న్యాయస్థానానికి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి లైజన్ అధికారి బాబుప్రసాద్, ఏపీపీ బాలకృష్ణమ నాయుడు, ఎఫ్ఆర్వో ఖ్యాతి, కోర్టు కానిస్టేబుల్ కృష్ణమూర్తి సాక్షాధారాలను కోర్టులో సమర్పించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నరసింహమూర్తి నిందితులకు ఈ మేరకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

లింక్ ఓపెన్ చేస్తే రూ.50వేలు మాయం

నాయుడుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అత్తలపాళెం గ్రామానికి చెందిన ఓ యువకుడి సెల్‌ఫోన్‌కు ప్రైజ్ వచ్చిందంటూ మెసేజ్ వచ్చింది. అందులోని లింక్ ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. అంతే క్షణాల్లో అతని బ్యాంక్ ఖాతాలోని రూ.50వేల నగదు మాయమైంది. దీంతో బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అగ్రికల్చర్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి అనుమతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు అనుమతిస్తూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ కారణాలతో తిరుపతి వ్యవసాయ కళాశాలలో నిర్వహిస్తున్న అగ్రికల్చర్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి అనుమతి నిరాకరించారు. అయితే, పలువురి విజ్ఞప్తి మేరకు ప్రవేశాలకు అనుమతించారు. ఈనెల 25వ తేదీకి వెబ్ ఆప్షన్ల నమోదుకు చివరి గడువుగా విధించినట్టు ప్రిన్సిపాల్ సుమతి చెప్పారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

● నర్సింగ్ కోర్సు చేసిన వారికి ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 21(ఆంధ్రజ్యోతి): నర్సింగ్‌కోర్సులు పూర్తిచేసిన వారికి జర్మనీ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో తిరుపతి నగరంలో షెడ్యూల్‌కులాలకుచెందిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం నర్సింగ్ పూర్తిచేసిన వారు అర్హులని, వారికి ఉచితంగా పది నెలలు జర్మనీ భాషపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 80083 59664, 87906 54826 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఎస్వీయూలో స్వయం కోర్సులకు మంచి స్పందన


ప్రశంసాపత్రంతో వీసీ అప్పారావు తదితరులు

● సైన్స్ కాలేజీకి స్వయం - ఎన్‌పీటీఈఎల్ నుంచీ ప్రశంస

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ నూతన విద్యా విధానం-2020లో భాగంగా విద్యార్థులు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొందేందుకు 'స్వయం' కోర్సులను అమలు చేస్తున్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, సెంట్రల్ యూనివర్సిటీలు ఈ విధానంలో కీలక భూమిక పోషిస్తున్నాయి. ఎస్వీయూ కూడా స్వయం కోర్సులను ప్రవేశపెట్టింది. దీనికి విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. దీనిపై స్వయం - ఎన్‌పీటీఈఎల్ నుంచి యూనివర్సిటీ సైన్స్ కాలేజీకి ప్రశంసలు లభించాయి. ఎక్కువ మంది విద్యార్థులు సైన్స్ కాలేజీ నుంచి స్వయంలో నమోదు చేసుకుని, ఉత్తీర్ణులై, సర్టిఫికెట్లు సైతం పొందారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ పద్మావతి, స్వయం ఇన్‌చార్జి భారతి, మీడియా డీన్ పీసీ వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగ విద్యార్థులకు స్వయం కోర్సులకు దరఖాస్తు చేసుకోవడంలో ఫీజు రాయితీ ఉండటం మంచి పరిణామమని అన్నారు.

చిత్తూరు డీసీసీబీకి నాబార్డు ప్రశంస



మెమెంటో అందుకుంటున్న డీసీసీబీ సీఈవో శంకర బాబు, నగరి పీఏసీఎస్ సీఈవో తులసి

నగరి/చిత్తూరు కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గడువుకు ముందే సింగిల్ విండోల కంప్యూటరీకరణ పూర్తి చేయడంతో పాటు జిల్లా రైతాంగానికి సహకార రంగం ద్వారా రుణాలు, అడ్వాన్సులు తదితర అంశాలలో ప్రతిభ కనబరిచిన చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)కు విశిష్ట గౌరవం లభించింది.నాబార్డు 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని నాబార్డు ప్రాంతీయకార్యాలయంలో సోమవారం రాష్ట్రస్థాయి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన చిత్తూరు, కృష్ణా, నెల్లూరు డీసీసీబీల అధికారులకు మెమొంటోలను అందజేశారు.సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు చేతుల మీదుగా చిత్తూరు డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు మెమొంటోను స్వీకరించారు.రాష్ట్రస్థాయిలో నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(సింగిల్‌విండో)ఉత్తమ పనితీరు కనబరిచినట్లు నాబార్డు గుర్తించి సన్మానించింది.చిత్తూరు జిల్లాకు సంబంధించి నిబంధనలు పాటించి బ్యాంకును ఉన్నతస్థాయికి తీసుకెళ్లడమే గాక అన్ని రకాల రుణాలను రైతులకు అందించినందుకు నగరి సింగిల్ విండో తరపున సీఈవో తులసిపిళ్లై, చైర్మన్ బాలాజి, డైరెక్టర్ జవహర్‌రెడ్డి మెమొంటో అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు చీఫ్ మేనేజర్ గోపాల్, ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్, ఆబ్కాబ్ ఎండీ శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9మంది స్మగ్లర్ల అరెస్టు

● 16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా బాలపల్లి ఫారెస్టు రేంజ్‌లో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు 9 మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 16 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఏఆర్ ఎస్ఐ బాలచెన్నయ్య బృందం స్థానిక ఎఫ్‌బీవో సుబ్బలక్ష్మితో కలిసి బాలపల్లి రేంజ్ అటవీప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు.ఆ ప్రాంతంలో కొందరు వ్యక్తులు రెండు కార్లతో టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటపడటంతో వారిని చుట్టుముట్టగా పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే టాస్క్‌ఫోర్సు పోలీసులు 9మందిని పట్టుకోగలిగారు. పట్టుబడిన వారు నంద్యాల, అన్నమయ్య జిల్లా, కర్ణాటకకు చెందిన వారిగా గుర్తించారు. వాహనంలోలోడ్ చేసిన 16 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లను వాహనాలతో సహా ఎర్రచందనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

3 గంటలు ఆలస్యంగా నడిచిన

ఇండిగో విమానం

అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రయాణికులు

రేణిగుంట జూలై 21:(ఆంధ్రజ్యోతి) : ఇండిగో విమానం సోమవారం మూడు గంటలు ఆలస్యంగా నడవడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బెంగళూరు నుంచి తిరుపతి విమానాశ్రయానికి .మధ్యాహ్నం 2.35కు వచ్చి తిరిగి హైదరాబాదుకు 2.55గంటలకు పోవాల్సిన విమానం సాంకేతిక కారణాలతో సాయంత్రం 5.05 గంటలకు వచ్చి 5.35 గంటలకు హైదరాబాదుకు వెళ్లింది. దీంతో టిక్కెట్లు బుక్ చేసుకున్న 40 మంది ప్రయాణికులు మూడు గంటలు విమానాశ్రయంలో పడిగాపులు కాశారు. ఇండిగో యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

బాధలు చెప్పాం.. పరిష్కారం చూపండి

అధికారులకు బాధితుల మొర ● కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్‌ఎస్'కు వచ్చిన అర్జీలు 194

చిత్తూరు అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం వేర్వేరుగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాలు జరిగాయి. అధికారులకు తమ బాధలు చెప్పుకుని పరిష్కారం చూపండంటూ బాధితులు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడేల్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, ఇతర జిల్లా అధికారులు స్వీకరించారు. వారి సమస్యలను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మొత్తం 194 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. రెవెన్యూశాఖకు 147, డీఆర్‌డీఏకు 19, పోలీసుశాఖకు 6, విద్యుత్ శాఖకు 4, ఐసీడీఎస్‌కు 3, పౌరసరఫరాలశాఖకు 3 అర్జీలతోపాటు ఎస్‌ఎస్, నేషనల్ హైవే, గృహ నిర్మాణ సంస్థ, రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్, గురుకుల విద్యాలయాలకు 12 అర్జీల చొప్పున ఉన్నాయి. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని..


అర్జీని పరిశీలించి, బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కనే జేసీ విద్యాధరి తదితరులు

ఆన్‌లైన్‌లో తక్కువ భూమి నమోదైంది

మొరం గ్రామ లెక్కదాఖలాలో ఖాతా నెంబరు 220లో సర్వే నెంబరు 764-3ఏలో 1.34 ఎకరాలు, 768-2లో 2.66 ఎకరాలు కలిపి మొత్తం నాలుగు ఎకరాల భూమి తన ఆధీనంలో ఉందని పలమనేరు కొత్తపేటకు చెందిన షేక్ హైదర్‌సాహెబ్ తెలిపారు. రీసర్వే తర్వాత అడంగల్, ఆన్‌లైన్‌లో 3.82 ఎకరాల మాత్రమే ఉందన్నారు.

పొలాలకు దారి లేకుండా పోయింది

ఓ రైతు తన భూమికి ఫెన్సింగ్ వేసుకోవడంతో పొలాలకు దారిలేకుండా పోయిందని కార్వేటినగరం మండలం కావేటిపురం గ్రామస్తులు ఆవేద న వ్యక్తం చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సర్వే నెంబరు 34లో ఉన్న బండిబాటను సర్వే చేసి పొలాలకు దారికల్పించాలని కోరారు.

భాగపరిష్కారం చేయడం లేదు

సర్వే నెంబరు 226-2లో తమకు ఐదు ఎకరాల భూమి ఉందని పెద్దపంజాణి మండలం అప్పినపల్లెకు చెందిన విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ భూమిని కుటుంబ సభ్యులకు భాగపరిష్కారం చేసివ్వాలని పలుమార్లు రెవెన్యూ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు.

ఆధార్ కార్డుల్లేక ఇబ్బందులు

తమ కుటుంబీకులకు ఆధార్‌కార్డులు లేకపోవడంతో ఏ పనులు కావడం లేదని గుడిపాల మండలం ఎంకేపురం నరిగపల్లెకు చెందిన ఉల్లమ్మ కోరారు. తాము ఎస్టీలమని తనతోపాటు భర్త, ముగ్గురి పిల్లలకు ఆధార్‌కార్డు లేదన్నారు. ఉల్లమ్మకు వెంటనే ఆధార్‌కార్డుతో పాటు రేషన్‌కార్డును మంజూరు చేయాలని డీఎస్వోను కలెక్టర్ ఆదేశించారు.

రైల్వే అండర్‌పాస్ ఏర్పాటు చేయించండి


కలెక్టరేట్‌కు వచ్చిన పెద్దకొత్తూరు, చుట్టుపక్కల గ్రామాలవాసులు

మురకంబట్టు సమీపంలో ఉన్న పెద్దకొత్తూరు, చుట్టుపక్కలగ్రామాల కోసం రైల్వే అండర్‌పాస్‌ను ఏర్పాటు చేయించాలని ఆయా గ్రామస్తులు కోరారు. ప్రస్తుతం ట్రాక్‌పైనే వెళుతున్నామన్నారు. డబుల్ ట్రాక్ వేస్తామని రైల్వే అధికారులు చెబుతున్నారని, అప్పుడు తాము మూడు, నాలుగు కిలోమీటర్లు చుట్టుకుని చిత్తూరుకు రావాల్సి వస్తుంన్నారు.

దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయండి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని దివ్యాంగుల సంఘ నేత చంద్రశేఖర్ కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సుమతి, చిరంజీవి, ఏకాంబరం, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు 38 అర్జీలు


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి 38 అర్జీలు అందాయి. బాధితుల నుంచి వినతులను ఎస్పీ మణికంఠ స్వీకరించారు. అక్కడికక్కడే పరిష్కారం అయ్యేవాటిని సంబంధిత అధికారులకు ఫోన్లుచేసి పరిష్కరించారు. మిగిలిన సమస్యలను నిర్దేశిత సమయంలోగా పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. వచ్చిన అర్జీల్లో.. భూ తగాదాలపై 14, ఆస్తి తగాదాలపై 5, కుటుంబ తగాదాలపై 5, ఇంటి తగాదాలపై 4, డబ్బు తగాదాలపై 3, దారి సమస్యలపై 3, వేధింపులపై 3, చీటింగ్‌పై ఒకటి చొప్పున ఉన్నాయి. ఈ కార్యక్రమంలో చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, డీటీసీ డీఎస్పీ రాంబాబు పాల్గొన్నారు.

పక్కా ఆధారాలతోనే మద్యం కేసులో వైసీపీ నేతల అరెస్టు

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్



చిత్తూరు సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పక్కా ఆధారాలతోనే మద్యం కేసులో వైసీపీ నేతలను అరెస్టు చేశారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేశారని మాజీ సీఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి, అంబటి రాంబాబు, అనిల్ కుమార్ తదితర వైసీపీ నేతలు ఆరోపించడం సిగ్గుచేటని చెప్పారు. దేశంలో ప్రకంపనలు సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కంటే వైసీపీ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్ 10 రెట్లు ఎక్కువని చెప్పారు. 2019 ఎన్నికల ముందు దశలవారీగా మద్యపాన నిషేధం చేస్తామని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి కమీషన్ల కోసం మద్యం పాలసీనే మార్చేసి.. మద్యాన్ని ఏరులై పారించారన్నారు. కల్తీ మద్యం తాగి 30వేలకు మందికిపైగా మృతి చెందారని, సుమారు 35 లక్షల మందికిపైగా కిడ్నీలు, లివర్లు పాడై ఆస్పత్రుల పాలయ్యారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో ఇమిటేషన్ బ్రాండ్లతో సుమారు రూ.3500 కోట్ల భారీ దోపిడీ చేశారని చెప్పారు. ఈ డబ్బులను ఎన్నికల్లో భారీగా ఖర్చు పెట్టారన్నారు. ఈ కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడిని లోకానికి పరిచయం చేయాల్సిన అవసరం సిట్‌కు ఉందన్నారు.

జిల్లా కోర్టుకు హాజరైన టీడీపీ నేతలు


చిత్తూరులోని జిల్లా కోర్టు వద్ద టీడీపీ నేతలు

రామకుప్పం, జూలై 21(ఆంధ్రజ్యోతి): కొళ్లపల్లె ఘటన కేసులో సోమవారం చిత్తూరులోని జిల్లా కోర్టుకు హజరయ్యారు. ఈ కేసులో హాజరుకావడం ఇది మూడోసారి. రెండున్నరేళ్ళ క్రితం విపక్షనేత హోదాలో చంద్రబాబు కొళ్లపల్లె పర్యటన క్రమంలో స్వాగత తోరణాలు కడుతున్న టీడీపీ నాయకులపై వైసీపీకి చెందిన వారు దాడి చేశారు. అయితే వైసీపీ నాయకుల ఫిర్యాదుపై పలువురు టీడీపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు నెలల క్రితం వరకు ఈ కేసు విచారణ కుప్పం కోర్టులో జరిగింది. ఇప్పుడు చిత్తూరులోని జిల్లా కోర్టులో జరుగుతోంది. ఈ క్రమంలో తాజాగా కోర్టుకు హాజరైన వారిలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారిశ్రీనివాసులు, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, నేతతు పత్రనారాయణాచారి, సత్యేంద్రశేఖర్, నాగరాజు. జయశంకర్, విశ్వనాథనాయుడు, నందిగంఉదయ్ కుమార్, శంకర్‌చలం, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

రేపు తిరుపతి కలెక్టరేట్‌లో స్పీకర్ సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జూలై 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా సెప్టెంబరులో జరుగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బుధవారం జిల్లా అధికారులతో సమీక్షిస్తారు. రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం వైజాగ్ నుంచి తిరుపతి విమానాశ్రయానికి మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆయన చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా తిరుమల వెళ్లి బస చేస్తారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుంటారు. ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని సమీక్షలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2గంటలకు పద్మావతి అతిథి గృహానికి చేరుకుని కొంతసేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం 6గంటలకు చంద్రగిరి కోటను సందర్శిస్తారు. రాత్రి బసచేసి గురువారం ఉదయం తిరుపతి విమానాశ్రయంనుంచి హైదరాబాద్ వెళతారు.

11 నుంచి బీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఆగస్టు 11వ తేదీ నుంచి బీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 11 నుంచి 14వ తేదీ వరకూ ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఫీజు చెల్లింపునకు జూలై 28వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. జ్ఞానభూమి.. వెబ్‌సైట్‌లో అప్లికేషన్ అందుబాటులో ఉంచినట్టు వర్సిటీ మీడియా డీన్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఏబీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షుడిగా వెంకటరత్నం



తిరుపతి(ఆటోనగర్), జూలై 21 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత రచనాత్మక సమాజ్ (ఏబీఆర్ ఎస్) జాతీయ నూతన అధ్యక్షుడిగా రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం నాయుడిని నియమించినట్లు ఆల్ ఇండియా హరిజన సేవక్ సంఘ్ జాతీయ అధ్యక్షులు శంకర్ కుమార్ సన్యాల్ వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ సేవా ధామ్ ఆశ్రమంలో ఆదివారం జాతీయ స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖాళీగా వున్న అధ్యక్ష స్థానానికి ఆంధ్రప్రదేశ్‌లోని రాస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న డాక్టర్ ఎస్.వెంకటరత్నం నాయుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం బీహార్ మాజీ ఎంపీ నరేష్ యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. వెంకటరత్నం నాయుడు మాట్లాడుతూ ఈ పదవి సేవా కార్యక్రమాలు అందించడానికి మరింత బాధ్యత పెంచిందన్నారు. అనతి కాలంలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అధ్యక్షులను నియమించి గాంధేయవాదాన్ని, సిద్ధాంతాలను విస్తృత పరచడానికి కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి దేశంలోని అన్ని రాష్ట్రాలనుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఏబీఆర్‌ఎస్ నూతన అధ్యక్షుడిగా వెంకటరత్నం నాయుడు నియమితులైన సందర్భంగా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, జనరల్ బాడీ సభ్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.




ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా పంట - వరినారును తొక్కేసిన ఏనుగులు - మూలమడుగు సమీపంలోని అటవీ సరిహద్దులో సంచరిస్తున్న ఏనుగులు

చుట్టుముడుతున్న ఏనుగుల గుంపులు

● పంటలపై దాడులతో రైతుల ఆందోళన

కల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలాన్ని ఏనుగుల గుంపు చుట్టు రెండు వైపులా ముట్టింది. తూర్పు,పశ్చిమ విభాగం అటవీ ప్రాంతాల్లో కొద్ది నెలలుగా తిష్ట వేసిన 16 ఏనుగుల గుంపు పాతపేట, చల్లావారిపల్లి, బోడిరెడ్డిగారిపల్లి, కల్లూరు, పాళెం, దేవళంపేట, కమ్మపల్లి పంచాయతీల్లో పంటలను ధ్వంసం చేస్తూ అపారనష్టం కలిగిస్తున్న విషయం తెలిసిందే. తాజా ఆదివారం రాత్రికి మరో 9ఏనుగుల గుంపు గడ్డంవారిపల్లి పంచాయతీలోకి ప్రవేశించింది.16ఏనుగులు దిగుమూర్తివారిపల్లి చేరుకుని రైతులు శివయ్య, నరసింహులుకు చెందిన మామిడి, టమోటా పంటను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి అరికెలవారిపల్లి, వెంకటదాసరపల్లి వద్దకు చేరుకున్న ఈ గుంపు గ్రామంలోని రైతులు క్రిష్ణయ్యకు చెందిన రాగిపంట, రామయ్య, చిన్నబ్బకు చెందిన వరినారును తొక్కేశాయి. తర్వాత గౌరిశెట్టివారిపల్లిలోని రైతు కృష్ణమూర్తికి చెందిన వరినారును తొక్కేశాయి. ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లిలోని కోదండయ్యకు చెందిన టమోటా పంటను ధ్వంసం చేశాయి. రైతులు శేఖర్, మునికృష్ణకు చెందిన పూలతోట, పశుగ్రాసం తొక్కేసిన ఏనుగుల గుంపు పాతపేట చేరుకున్నాయి. రామూర్తి, సురేంద్రకు చెందిన పశుగ్రాసం తినేశాయి. సోమవారం గోగులమ్మవంక సమీపంలో ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు. మరోక వైపు తిరుపతి జిల్లా నుంచి ప్రవేశించిన ఏనుగుల గుంపు పగడాలవారిపల్లిలోని పలువురు రైతుల మామిడి కొమ్మలను విరిచేశాయి. తర్వాత అడవిలోకి వెళ్లినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి తెలిపారు.

జీవన ఎరువులతో పంటకు బలం


మహిళా రైతుకు జీవన ఎరువు అందిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవన ఎరువులతో పంటలకు బలమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో ప్రజలనుంచి అర్జీలు స్వీకరించాక వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట పైరు వాడకం ద్వారా 25శాతం ఎరువులు ఆదా అనే వాల్ పోస్టర్‌ను జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడెల్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం రైతులకు ద్రవరూపంలోని జీవన ఎరువులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, వ్యవసాయశాఖ జేడీ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు మరింత చేరువగా పోలింగ్ కేంద్రాలు

అదనంగా 268 పోలింగ్ కేంద్రాలు ఏర్పడే అవకాశం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఓటర్లకు మరింత చేరువగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాలాచోట్ల 1500 మందికి ఒక పోలింగ్ కేంద్రం ఉండడంతో ఓటు హక్కు వినియోగించుకోవడానికి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు. ఓటు వేయడానికి క్యూలో గంటల తరబడి నిరీక్షించాల్సివస్తోంది. ఎక్కువ సమయం నిలబడివుండలేక చాలామంది ఓటింగ్‌కు దూరమవుతున్నారు.ఈ క్రమంలో 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఇటీవల కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీచేసింది. దీంతో 1200కు పైబడి ఓటర్లుంటే సమీపంలోని కేంద్రంలోకి వారి ఓట్లు చేర్చడం లేదా కొత్తగా మరో కేంద్రం ఏర్పాటు చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 1776 పోలింగ్ కేంద్రాలుండగా, 268 పోలింగ్ కేంద్రాల్లో 1200 మందికి పైబడి ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. సహాయ ఎన్నికల అధికారులు నియోజకవర్గ కేంద్రాల్లో గతవారం సమావేశాలు ఏర్పాటుచేసి పోలింగ్ కేంద్రాల మార్పుపై కసరత్తు చేశారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ సుమిత్‌కుమార్ నేతృత్వంలో సమావేశం నిర్వహించి కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు తెలియజేశారు. ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలను ఆయన వివరించారు. జిల్లాలో 1200 మందికి మించి ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు పలమనేరు, కుప్పం, పుంగనూరు, చిత్తూరు, పూతలపట్టు, నగరి నియోజకవర్గాల్లో ఉన్నాయి. తక్కువగా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఉన్నాయి. దీంతో 268 అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పడే అవకాశం ఉంది.కొత్తకేంద్రాల ఏర్పాటుపై అధికారులు కసరత్తు పూర్తిచేసి ముసాయిదా జాబితా తయారుచేస్తున్నారు. ఈ నెలాఖరులోగా అన్ని నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు తీసుకుని, వాటిపై రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు.వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తుది ఆమోదం నిమిత్తం ఎన్నికల సంఘానికి పంపిస్తారు. ఎన్నికల కమిషన్ ఆమోదం లభించిన తర్వాత కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

పోలింగ్ కేంద్రాలిలా....

నియోజకవర్గం	ప్రస్తుతం ఉన్నవి	1200 మందికి మించినవి
పుంగనూరు	265	38
నగరి	233	30
గంగాధరనెల్లూరు	256	20
చిత్తూరు	229	36
పూతలపట్టు	262	32
పలమనేరు	288	63
కుప్పం	243	49
మొత్తం	1776	268



రూ.11కోట్లతో గిరిజన విద్యాసంస్థల అభివృద్ధి

మంత్రి గుమ్మడి సంధ్యారాణి

తిరుపతి, జూలై21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గిరిజన విద్యాసంస్థలు, హాస్టల్స్, శిశుసంక్షేమ కేంద్రాల అభివృద్ధికి అనేక నిధులు మంజూరయ్యాయని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం తిరుపతి పద్మావతి అతిథిగృహంలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ తిరుపతిలోని బాలికల హాస్టల్, స్టాఫ్ క్వార్టర్స్ కొత్త భవనాల కోసం రూ.352లక్షలు, అదనపు సిబ్బంది నివాసాల నిర్మాణం కోసం రూ.180 లక్షలు, బీఎన్‌కండ్రిగ, శ్రీకాళహస్తి బాలుర వసతి గృహాల కోసం రూ.420లక్షలు, సీఎస్ఆర్ నిధుల ద్వారా 23 సంస్థలకు కలిపి రూ.176లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ పనులు పూర్తవ్వడం ద్వారా జిల్లాలోని గిరిజన విద్యాసంస్థలు, హాస్టల్స్, శిశు సంక్షేమ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు మెరుగవుతాయని తెలిపారు. ప్రతి చిన్నారికీ పోషకాహారం, విద్య, ఆరోగ్యం చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నట్లు చెప్పారు. కాగా తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పలు స్థానిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఆఫీసర్ వర్సెస్ అటెండర్

రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో వివాదం

పోలీస్ స్టేషన్లో పరస్పరం ఫిర్యాదులు


సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడుతున్న అటెండర్ తిరుమలేష్, దళిత సంఘం నాయకులు

రేణిగుంట జూలై 21(ఆంధ్రజ్యోతి) : జిల్లా అధికారి ఇచ్చిన ఉత్తర్వు మేరకు అటెండర్‌ను విధుల్లోకి తీసుకోకుండా సబ్ రిజిస్ట్రార్ తిరస్కరించడంతో చెలరేగిన వివాదం పోలీస్ స్టేషన్లో పరస్పరం ఫిర్యాదుల వరకు దారితీసింది. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఎస్.తిరుమలేశ్‌ను ఫిబ్రవరి నెలలో ఓ విచారణ నిమిత్తం డిప్యుటేషన్‌పై సత్యవేడుకు పంపారు. తనను డిప్యుటేషన్‌పై పంపడం సరికాదని ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో రేణిగుంటలోనే కొనసాగించమంటూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు జిల్లా రిజిస్ట్రార్ రేణిగుంటలోనే పనిచేయాల్సిందిగా తిరుమలేశ్‌కు ఉత్తర్వులు ఇచ్చారు. విధుల్లో చేరేందుకు గత సోమవారం రేణిగుంట కార్యాలయానికి వెళ్లడంతో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డి అంగీకరించలేదు. రోజూ కార్యాలయానికి వెళుతున్నా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయనీకపోవడంతో తిరుమలేశ్ సోమవారం ఎమ్మార్పీఎస్ నేతలతో కలసి ఎస్ఆర్ కార్యాలయానికి వెళ్లారు.ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ విషయంపై దళిత సంఘం నాయకుడు గోపి మీడియాతో మాట్లాడుతూ అటెండరు దళితుడని లెక్కనేనితనంతో ఆనంద్ రెడ్డి వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు.' నిన్ను పనిలో పెట్టుకోను ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో.. అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి అవమానించారని ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశామన్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆనంద రెడ్డి మాట్లాడుతూ అటెండర్ ప్రవర్తన సరిగ్గా లేని అటెండర్ తిరుమలేశును విధుల్లో చేర్చుకోనని ఇదివరకే జిల్లా రిజిస్ట్రార్‌కు తెలిపానన్నారు. అయితే కొంత మంది దళిత సంఘ నాయకులను తీసుకువచ్చి తనపై దౌర్జన్యం చేయడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.కాగా ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో కేసులు నమోదు చేస్తే ఇబ్బందని పోలీసులు చెప్పడంతో ఇరువర్గాలూ వెనకడుగు వేసినట్టు సమాచారం. తర్వాత అక్కడ నుంచి జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్‌కుమార్ వద్దకు పంచాయితీ మారినట్టు తెలిసింది. చివరకు వారిద్దరూ రాజీపడి ఫిర్యాదులను వెనక్కు తీసుకున్నారు. అటెండర్‌ను విధుల్లోకి తీసుకునేందుకు సబ్ రిజిస్ట్రార్ అంగీకరించినట్లు తెలిసింది.

చంద్రబాబు పాలనలోనే ప్రజా సంక్షేమం


చింతలవారిపల్లెలో టీడీపీ నాయకులతో చల్లా

సోమల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి సీఎం. చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం నెల్లిమంద, చింతలవారిపల్లె, కమ్మపల్లె, కందూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. తొలుల సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంపై కార్యకర్తలు, నాయకులతో సమీక్షించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉయ్యాల రమణ, ఏఎంసీ ౖచెర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగల్ విండో ౖచెర్మన్ శివశంకర్, మాజీ ౖవెస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, పి. శ్రీనివాసులు, బాలకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరించండి

రొంపిచెర్ల: సోమల మండలంలోని పలు సమస్యలు పరిష్కరించాలిని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, మాజీ మండల ఉపాధ్యక్షుడు ఉమాపతినాయుడులు పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డిని కలిశారు. వీరు చెప్పిన సమస్యలపై ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సోమల శీతలీకరణ కేంద్రం పునఃప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. స్వస్తిక్ పాల డైరీ నుంచి రైతులకు రూ.82 లక్షల వరకు బకాయి రాబట్టేలా చూడాలని ఏఎంసీ ౖచెర్మన్ శ్రీనివాసులు నాయుడు కోరారు. చల్లాను కలిసినవారిలో సుహేల్‌బాషా, సుబ్రమణ్యం, వరదం జనార్దన, నౌషాద్ పాల్గొన్నారు.

గురుకులంలో పారిశుధ్యంపై అసంతృప్తి


విద్యాలయం ప్రిన్సిపాల్‌తో చర్చిస్తున్న నేతలు

రామకుప్పం, జూలై 21(ఆంధ్రజ్యోతి): తిమ్మసముద్రంలోని అంబేద్కర్ గురుకుల విద్యాలయాన్ని సోమవారం ౖవెస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి తదితరులు సందర్శించారు. పారిశుధ్యలోపంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ రజనీకుమార్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాలయం ఆవరణ శుభ్రంగా ఉంచాలని, భోజనంలో నాణ్యత పాటించాలని సూచించారు. కడ సలహా కమిటీ సభ్యుడు రఘు, నేతలు గుర్రప్ప, శ్రీనివాసులు, విజయ్‌కుమార్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, అల్లీశీను తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో విశేష పూజలు



రామకుప్పం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆషాడమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని, అర్చనలు చేయించారు. ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కుప్పం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మానవ సేవలోనే దైవసేవ ఉందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక కుప్పం కమిటీ అధ్యక్షుడు కృష్ణ అన్నారు. బెంగళూరులో కొత్తగా ఉద్యోగం వచ్చిన రాకేశ్ అనే కుప్పం యువకుడు తన మొదటి వేతనంతో 10 త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను సోమవారం కొనుగోలు చేశాడు. వీటిని బంధువులు, మిత్రులకు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కుప్పం కమిటీ సభ్యులు దేవరాజు, శరవణ, కృష్ణమూర్తి, శివకృష్ణ, రితీశ్ కుమార్, లోకేశ్, చరణ్, దిలీప్, వెంకటలక్ష్మి, జలజాక్షి, వాణి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన


మొక్క నాటుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

బైరెడ్డిపల్లె, జూలై 21 (ఆంధ్రజ్యోతి): యువభారత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బైరెడ్డిపల్లెలోని మునినారాయణ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. వీటిని అరులు ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో వివరించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్ ముఖ్య అతిథిగా పాలొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మహేష్, యువ భారత్ అసోసియేషన్ అధ్యక్షుడు వేకాంత్, కార్యదర్శి గణేష్, పరంధామ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌పై నిరసనలు


రామాపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

పుంగనూరు/సోమల/కల్లూరు/సదుం,జూలై 21(ఆంధ్ర జ్యోతి): రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌ను ఖండిస్తూ ౖవెసీపీ నాయకులు సోమవారం పలుచోట్ల నిరసన వ్యక్తం చేశారు. పుంగనూరు ప్రైవేటు బస్టాండ్ వద్ద ౖవెఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించాక నోటికి నల్లబట్టలు ధరించి ర్యాలీ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ౖచెర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. సోమల మండలం కామిరెడ్డివారిపల్లెలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పులిచెర్ల మండలం రామిరెడ్డిగారిపల్లెలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. సదుం మండలం రామాపురంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలో ౖవెసీపీ ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి, రెడ్డప్ప రెడ్డి, ఇమ్రాన్, జిల్లా ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ మాధవి, ధనంజయరెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

జిల్లా బీజేపీ కార్యదర్శిగా ప్రభాకర్

పలమనేరు, జూలై21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బీజేపీ కార్యదర్శిగా జి.ఆర్.ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మకంతో తనకు పార్టీ పదవి ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌కు, జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి బీజేపీ పటిష్టతకు కృషిచేస్తానన్నారు. పలువురు ఆయనను కలిసి అభినందించారు. అభినందించిన వారిలో ఉమామహేష్, వెంకటాద్రి, మొగిలీశ్వర్, మనోహర్‌గుప్తా, ఆంజనేయులు, ద్రాక్షాయిణి తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



పలమనేరు, జూలై21 (ఆంధ్రజ్యోతి) : గంగవరం మండలంలోని మదర్ థెరిసా కళాశాలలో సోమవారం విద్యార్థులకు అగ్నిప్రమాద నివారణపై అవగాహన కల్పించారు. పలమనేరు అగ్నిమాపక దళ సిబ్బంది కళాశాలకు వెళ్లి ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. వారు డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి రైతు దినోత్సవాన్ని జయప్రదం చేయండి

పలమనేరు, జూలై21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈనెల 22వ తేది జరిగే మామిడి రైతు దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘ నాయకులు ఉమాపతి నాయుడు పిలుపునిచ్చారు. మామిడి రైతు దినోత్సవం సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పుష్పరాజ్, మొసలిమడుగు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు , చంద్రవేణమ్మ దంపతులు ఉమాపతి నాయుడుకు రైతు కండువాలను అందజేశారు. మామిడిరైతు దినోత్సవానికి మామిడిరైతులందరూ తరలిరావాలని ఉమాపతినాయుడు పిలుపునిచ్చారు.

మాల మహానాడు మండల అధ్యక్షుడిగా మంజునాథ్


అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న మాలమహానాడు కార్యవర్గ సభ్యులు

పెద్దపంజాణి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం మాలమహానాడు మండల కార్యవర్గ ఎన్నిక జరిగింది. ముఖ్య అతిథులుగా రాయలసీమ మాలమహానాడు జోన్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, జిల్లా ప్రచార కార్యదర్శి తిప్పయ్య హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా ముత్తుకూరు మంజునాథ్, గౌరవాధ్యక్షుడిగా బ్రాహ్మణపల్లె తిరువళప్ప, ప్రధాన కార్యదర్శిగా బట్టందొడ్డి రామచంద్ర, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బెరపల్లె జయరాం, వీరప్పల్లె నాగార్జున, కార్యదర్శిగా చలమంగళం సత్య సాయికుమార్, కోశాధికారులుగా కొళత్తూరు క్రిష్ణమూర్తి, బొమ్మలకుంట చిన్నరెడ్డెప్పలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


గుంతలను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు, జూలై21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేట్టినట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పట్టణంలో ఏవీరావు వీధి, ఆంజనేయస్వామి గుడివీధి తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు సీవీరెడ్డి, సద్దాంహుసేన్‌లతో కలిసి మురుగుకాల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షపునీకాల్వలో పేరుకున్నమట్టిని తొలగిస్తున్నట్లు వివరించారు గుంతలకు త్వరలో మరమ్మతులు చేపడతామన్నారు.

భూ ఆక్రమణపై విచారణ జరపాలని నిరసన


భాధిత రైతుతో కలిసి నాయకుల నిరసన

బైరెడ్డిపల్లె, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దేవదొడ్డి వద్ద బాషు సాబ్ అనే రైతుకు చెందిన భూమిని కొందరు ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద జాతీయ మానవహక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షుడు మునిరత్నం ఆధ్వర్యంలో రైతు కుటుంబీకులు నిరసన తెలిపారు. విచారణజరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో అవినీతి నిర్మూలన సంస్థ ప్రతినిధులు కవీశ్వర్, సోమశేఖర్, మణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు ఇస్తున్నా తీరని రెవెన్యూ సమస్యలు


గ్రీవెన్స్‌డేలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీలో భవాని

పలమనేరు, జూలై21 (ఆంధ్రజ్యోతి) : పదే పదే రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఇస్తున్నా పరిష్కరిచడం లేదని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి ప్రజలు రెవెన్యూ సమస్యలపై ఆర్డీఓ భవానికి అర్జీలు ఇచ్చారు. వీటిపై స్పందించిన ఆమె వాటి పరిష్కారానికి సంబంధిత తహసీల్దార్‌లతో ఫోన్ లో మాట్లాడారు. వినతుల వివరాలను తెలియజేస్తూ పరిష్కరించాలని సూచించారు. భూసర్వే సమస్యలపై పలువురు ఫిర్యాదు చేశారు. సర్వేలో తమ భూముల విస్తీర్ణం తగ్గిపోయిందన్నారు.

దావా పరిష్కరించక ఇబ్బంది

పలమనేరు మండలం మొరం పంచాయితీ కన్నమాకులపల్లికి చెందిన ఈశ్వరమ్మకు 43 సెంట్ల అసైన్‌మెంట్ భూమి వుంది. అయితే ఈ భూమి తమకు చెందిందని క్రిష్ణవేణమ్మ అనే మహిళ గతంలో ఆర్‌ఓఆర్ కోర్టులో దావా వేసింది. పలమనేరుకు ఆర్డీవో పరిధికి ఈ కేసు బదిలీ చేసినా ఇప్పటివరకూ విచారించలేదని ఈశ్వరమ్మ వాపోయింది. ఆమె ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించింది. తనపేరున అడంగల్ రావడం లేదని పేర్కొంది.

మాగాణిని మెట్టభూమి చేశారు

చౌడేపల్లి మండలం అప్పినేపల్లినికి చెందిన చిన్నరెడ్డెప్పనాయుడికు గ్రామంలో 85 సెంట్ల భూమి ఉంది. వాస్తవానికి మాగాణి భూమి అయితే భూసర్వేలో మెట్టభూమిగా అడంగల్‌లో పేర్కొన్నారని రైతు ఆవేదన చెందారు. భూమి మార్పుపై తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి విసిగి వేసారి ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించానన్నారు.

వైభవంగా పాలేటమ్మవారి జాతర


పాలేటమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు

సోమల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నెల్లిమందలో పాలేటమ్మవారి జాతర సందర్భంగా సోమవారం సిద్ధభగిత పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి చాందినీ బండ్లు, అన్నదాన బండ్లు మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా చేరుకుని ఆలయం చుట్టు ప్రదక్షిణ చేశారు. మహిళలు పొంగళ్ళు సమర్పించారు. ఆసాధివారు రాత్రి జాగరణలతో అమ్మవారిని కీర్తిస్తూ జీవిత విశేషాలను భక్తులకు వివరించారు. సాయంత్రం ఉత్సవమూర్తికి జలాభిషేకం,పాగేటి ఉత్సవం శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ ౖచెర్మన్ శ్రీనివాసులు నాయుడు, మాజీ ౖవెస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, హరిప్రసాద్, శివశంకర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : రమాదేవి


సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

పలమనేరు, జూలై21(ఆంధ్రజ్యోతి) : ఆదాని కంపెనీ ప్రయోజనాలకోసమే బిగిస్తున్న విద్యుత్ స్మార్టు మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం కేంద్ర కమిటి సభ్యురాలు డి.రమాదేవి పిలుపునిచ్చారు. సోమవారం పలమనేరులోని రాజహంస ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఎం జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆమె ప్రసంగించారు. గత ఎన్నికల సందర్భంగా నారాలోకేష్ స్మార్టు మీటర్లను వ్యతిరేకించి అధికారంలోకి వచ్చాక నోరుమెదపకపోవడం అన్యాయమన్నారు. స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా ఈనెల 16నుంచి ఆగష్టు 4 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపు ఇచ్చినట్టు పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, నాయకులు సురేంద్ర, ఓబుల్‌రాజు, గిరిధరగుప్తా, షీకీలా తో పాటు నాయకులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం



కల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మంగళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు పాఠశాల ఆవరణలో సోమవారం హెచ్‌ఎం ఫజురుల్లా అధ్యక్షతన సన్మాన సభను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎక్కడ పనిచేసినా సమయపాలన పాటించాలన్నారు. అందరి మన్ననలు పొందాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను పూలమాలతో సన్మానించారు.

చంద్రబాబు సారథ్యంలోనే సుపరిపాలన సాధ్యం


మహిళకు కరపత్రాలు అందజేస్తున్న నేతలు

రామకుప్పం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలనతో సీఎం చంద్రబాబు సారథ్యంతోనే సుపరిపాలన సాధ్యమని నిరూపితమైందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డిలు అన్నారు. సోమవారం రామకుప్పంలో వారు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఎంసీ మాజీ ౖవెస్‌ౖచెర్మన్ సీతాపతి, జయశంకర్, అవినాశ్‌రెడ్డి, గిరిదాసు, బాబు, మంజునాథ్, అల్లీశీన పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాల ఫలాలు

సీఎం చంద్రబాబు పాలనలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం, కామరాజనాయక్‌లు తెలిపారు. వారు బల్ల, పెద్దూరు గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. యూనిట్ ఇన్‌చార్జి గజేంద్ర, బాబు,వేణు, రాజేంద్ర, శ్రీనివాసులు, హనుమంతు పాల్గొన్నారు.

పేదరిక రహిత సమాజమే పీ4 లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ రవికుమార్

కల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికం లేని సమాజ నిర్మాణమే పీ4 లక్ష్యమని డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం డిజిటల్,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులతో పీ4 సర్వే, గ్రామసభలపై సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఇప్పటికే పీ4 సర్వేలో బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. బంగారు కుటంబాలకు సహాయం చేసేందుకు మార్గదర్శులను గుర్తించాలన్నారు. తహశీల్దార్ జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్, మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు. **రొంపిచెర్ల:** మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో డ్వామా పీడీ రవికుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీవో మాధుసూదనరెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్‌లకు పీ4 కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఆట్టడుగ్గు కుటుంబాలను సంపద కుటుంబాలు దత్తత తీసుకొని తోడ్పాటు అందించడం కార్యక్రమ లక్ష్యమన్నారు. ఐవీఆర్ఎస్ సర్వే గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

సంక్షేమ కార్యక్రమాలపై ఇంటింటి ప్రచారం



పలమనేరు, జూలై21 (ఆంధ్రజ్యోతి) : కొలమాసనపల్లిలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటరత్నం, మండల ప్రధాన కార్యదర్శి గణేష్, నేతలు సెల్వరాజ్, హేమసుందరం, సెల్వరాజు, వెంకటేసు, షరీష్, దేవేంద్ర, మణి,రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సోమల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వయంభేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు విద్యాసాగర్ స్వామి వారికి ప్రత్యేక అభిషేకపూజలు చేశారు. మల్లేశ్వరపురంలోని మల్లేశ్వరస్వామి, దుర్గంకొండ గార్గేయ మునీశ్వర స్వామి, చెన్నపట్నం చెరువునేల మల్లేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని నాగిరెడ్డిపల్లెలో సోమవారం సోమేశ్వరస్వామి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. నాగేంద్ర స్వామివారికి అభిషేకంచేసి ప్రత్యేకపూజలు జరిపారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కుప్పంలో చిరు జల్లులు

కుప్పం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో సోమవారం మధ్యాహ్నం నుంచీ చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై కనిపించింది. మధ్యాహ్నం మీదట తుంపర కురిసింది. వాతావరణం పూర్తిగా చల్లబడింది.

ప్రతి అర్జీనీ గడువులోగా పరిష్కరించాలి

సోమల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించాలని తహసీల్దార్ మధుసూదన్ చెప్పారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి సందర్శనలతో సమస్యలు పరిష్కరించాలన్నారు. భూ సర్వేల కోసం అధికంగా వినతులు అందుతున్నాయన్నారు. ఇరువర్గాల వారి సమక్షంలోనే సర్వే చేసి న్యాయం చేయాలన్నారు.

104 వాహనం తనిఖీ


104 వాహనాన్ని పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ ప్రతాప్‌కుమార్

బైరెడ్డిపల్లె, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తంలో 104 వాహనాన్ని సోమవారం 104 జిల్లా మేనేజర్ ప్రతాప్‌కుమార్ తనిఖీచేశారు. వాహనం శుభ్రత, పనితీరు పరిశీలించి డ్రైవర్‌కు, 104 సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ వాహనం ద్వారా గ్రామీణప్రాంతప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ శాలిని, సీహెచ్‌వో మౌనిక, డీఈవో బేబీ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గంలో పెద్దమఠంబాబుకు స్థానం

పుంగనూరు రూరల్, జూలై21(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కార్యవర్గంలో పుంగనూరు పెద్దమఠంబాబుకు స్థానం కల్పించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్‌నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పెద్దమఠంబాబు మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో జిల్లా స్థాయిలో అవకాశాలు ఇచ్చినందుకు నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను కూటమి నాయకులు అభినందించారు.

కందూరులో మహాభారత యజ్ఞం

సోమల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కందూరులో మహాభారత యజ్ఞం సందర్భంగా సోమవారం పంచపాండవ విగ్రహాలకు ఆలయ ధర్మకర్త శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈక్రమంలోనే భాగవతారిణి గీతాశ్రీ పాండవ విద్యాభ్యాసం కథను భక్తులకు వినిపించారు. రాత్రి పీలేరు, చంద్రగిరి వెంకటేశ్వర నాటక మండలి సభ్యులు వారణావతారం నాటకాన్ని ప్రదర్శించారు.

నేడు వరసిద్ధి ఆలయంలో ప్రదోష కాల పూజలు

ఐరాల(కాణిపాకం), జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో మంగళవారం ప్రదోష కాల పూజలు నిర్వహించనున్నట్లు వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ప్రధాన ఆలయానికి అనుబంధమైన మరగదాంబిక సమేత వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల మధ్యలో ప్రదోష కాల పూజలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రూ.130 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశాం

● ఎమ్మెల్యే మురళీమోహన్



పి.కొత్తకోటలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నియోజకవర్గంలో రూ.230 కోట్లకు మించి ప్రణాళికలు రూపొందిస్తే, ప్రస్తుతం రూ.130 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తిచేశామని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. సోమవారం పి.కొత్తకోట పంచాయతీలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పి.కొత్తకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.25 లక్షలతో నిర్మించిన తరగతి గదులను, సామాజిక ఆరోగ్యకేంద్రంలో రూ.25లక్షలతో, పశువైద్యశాలలో రూ.5లక్షలతో చేపట్టిన ఆధునీకరణ పనులను, సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో రూ.21లక్షలతో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులను, డి.మిట్టూరులో రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి యువరాజులు నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రబాబునాయుడు, మాజీ జడ్పీటీసీ బాబురావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీటీల బాధ్యతల స్వీకరణ

గంగాధరనెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలానికి డిప్యూటీ తహసీల్దార్‌గా కొత్తకోట మహేష్‌కుమార్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా వి.ఎస్.మహేశ్వరిలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీటీగా పనిచేస్తున్న తులసీరామ్.. చిత్తూరు అర్బన్ మండలానికి, ఎలక్షన్ డీటీ కరణం మోహన్‌రాజ.. పూతలపట్టు మండలానికి బదిలీపై వెళ్లారు.

టీడీపీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు



కృష్ణమనాయుడు, దేవసుందరాన్ని సన్మానిస్తున్న నేతలు

గంగాధర నెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. చిత్తూరులోని స్వగృహం ఆయనతో పాటు చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరాన్ని టీడీపీ నేతలు సోమవారం సన్మానించారు. నేతలు రాంబాబురెడ్డి, శ్రీధర్‌యాదవ్, దీపక్‌నాయుడు, అంజినేయులుశెట్టి, విజయకుమార్‌రెడ్డి, మోహన్‌నాయుడు, జయచంద్రారెడ్డి, దేవపత్ని కిరణ్‌నాయుడు, శివప్రసాద్, నీరజాక్షులురెడ్డి, జీవరత్నం, శాంతకుమార్, చిదంబరం, కండ్రిగ శంకర్, మహబూబ్ బాషా, సంపత్, రాజేంద్రన్, జాన్, సగికుమార్, స్వామినాధన్, పట్టాభి, కమల్, గోపి పాల్గొన్నారు.

జీవన ఎరువులతో అధిక దిగుబడులు

యాదమరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవన ఎరువుల వాడకం వల్ల అధిక దిగుబడులు వస్తాయని రైతులకు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. సోమవారం 14 కండ్రిగ సచివాలయ రైతు సేవాకేంద్రం వద్ద ఈ మేరకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. జీవన ఎరువుల వాడకంతో సాగు ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. ఏవో దీప, ఏఈవో మోక్షీశ్వరి పాల్గొన్నారు.

దారి సమస్యపై ట్రైనీ కలెక్టర్ విచారణ



తహసీల్దార్‌తో కలిసి దారిని పరిశీలిస్తున్న నరేంద్ర

యాదమరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దారి సమస్యపై వచ్చిన ఫిర్యాదును ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్ పరిశీలించారు. వరదరాజుల పల్లెకు చెందిన కొందరు తమ పంటపొలాల అక్రమంగా దారి ఏర్పాటు చేశారని అదే గ్రామంలోని దళితవాడకు చెందిన భూపట్టాదారు డేవిడ్ భార్య శశిరేఖ సోమవారం కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలతో సోమవారం తహసీల్దార్ పార్థసారథి, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ తులసీధర్, వీఆర్వో సురేష్‌లతో కలిసి ట్రైనీ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నివేదికను కలెక్టరుకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

యాదమరి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న చిత్రానాయుడు

యాదమరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): యాదమరి సహకార సంఘ (పీఏసీఎస్) చైర్ పర్సన్‌గా వి.చిత్రానాయుడు, డైరెక్టర్లుగా ఎస్.మహబూబ్ బాషా, డి.ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నాక జోడిచింతల వద్ద ఉన్న పీఏసీఎస్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. వీరిని అధికారులు, పలువురు నేతలు అభినందించారు. తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఏపీవో సంధ్యారాణి, పీఏసీఎస్ సీఈవో గుణశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, సర్పంచ్‌లు పత్తిపాటి భగవతి, భజలింగం, హేమయ్య నాయుడు, నాయకులు హేమగిరి, వల్లేరు అమరనాథ నాయుడు, నిత్యానంద, విజయేంద్ర యాదవ్, గుణశేఖర్, గోపిగౌడ్, రవి, వేణు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను గుర్తించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీనివాసులు

పెనుమూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రామసభలు నిర్వహించి బంగారు కుటుంబాలను గుర్తించాలని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసులు సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సెక్రటరీలు, ఇతర సచివాలయ సిబ్బందితో పీ4 సర్వేపై సమావేశం ఏర్పాటు చేశారు. అలాగే సమాచారచట్టంపై అవగాహన కల్పించారు. సీపీవో సాంబశివారెడ్డి, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



ఎన్నికైన విద్యార్థి ప్రతినిధులతో సీఐ విక్రమ్

నగరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని, అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని నగరి సీఐ విక్రమ్ తెలిపారు. నారాయణ పాఠశాలలో సోమవారం జరిగిన విద్యార్థి ప్రతినిధుల ఎన్నికల్లో ఆయన పాల్గొన్నారు. ఏటీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ కార్తీక్, సుదర్శన్ పాల్గొన్నారు.

గ్రావెల్ క్వారీలను అరికట్టి ప్రకృతిని కాపాడండి : బీజేపీ



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నేతలు

విజయపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రావెల్ క్వారీలను అరికట్టి ప్రకృతిని కాపాడాలని విజయపురం తహసీల్దార్ కిరణ్‌కు సోమవారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు.మండలంలో గ్రావెల్ క్వారీలకు అనుమతి విచ్చలవిడిగా ఇచ్చేస్తున్నారని, తమిళనాడు హైవే పేరుతో మన ప్రకృతి సంపదను దోచేస్తున్నారని వాపోయారు. హైవే రోడ్డు పనులకు వంద టిప్పర్లు మట్టి వెళితే ప్రైవేటు వ్యక్తులకు 200 టిప్పర్లు అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై కేంద్రమంత్రికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. నాయకులు రాజశేఖర్‌రాజు, కైలాసం యాదవ్, రమేష్‌నాయుడు, యుగందర్‌రాజు, పురుషోత్తంరెడ్డి, జలజ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు
ప్రదోష కాల పూజలు

ఐరాల(కాణిపాకం), జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో మంగళవారం ప్రదోష కాల పూజలు నిర్వహించనున్నట్లు వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ప్రధాన ఆలయానికి అనుబంధమైన మరగదాంబిక సమేత వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల మధ్యలో ప్రదోష కాల పూజలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

● ఎమ్మెల్యే జగన్మోహన్



జగన్మోహన్, చంద్రప్రకాష్‌లను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చిత్తూరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. సోమవారం చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్ఆర్ పేట, గువ్వకల్లు, పెరుమాళ్లకండ్రిగ, చింతగుంట పంచాయతీల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఎన్ఆర్ పేట ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు క్రికెట్ కిట్లను వితరణ చేసి సరదాగా వారితో క్రికెట్ ఆడారు. గువ్వకల్లులో సీసీ రోడ్డును, పెరుమాళ్లకండ్రిగలో గోకులం షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నాయకులు చంద్రప్రకాష్, జయచంద్రనాయుడిని స్థానికులు సత్కరించారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు మోహన్‌రాజ్, కంద అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మా పొలాల్లో కొబ్బరి మొక్కల తొలగింపు అన్యాయం: రైతులు

● హైకోర్టు ఉత్తర్వులు తమకు అనుకూలంగా వచ్చాయంటున్న గుడి నిర్వాహకులు



పొలాలను ఎక్స్‌కవేటర్‌తో చదునుచేసి తొలగించిన కొబ్బరి మొక్కలు



గంగాధరనెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అగరమంగళంకు సమీపంలోని తమ పొలాల్లో నాటిన కొబ్బరి మొక్కలను తొలగించడం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగరమంగళం చెరువు కట్ట కింద బెంగళూరుకు చెందిన దీపక్‌కుమార్ తాళ్ల అంకాళపరమేశ్వరి గుడి నిర్మించారు. గుడిని విస్తరించే క్రమంలో పక్కనున్న శంకరబోయుడికి చెందిన 79 సెంట్లు, ఆనందబాబుకు చెందిన 18సెంట్లు, చిట్టెమ్మకు చెందిన 84 సెంట్లు, భీష్మయ్యకు చెందిన ఎకరా, పార్వతికి చెందిన 66 సెంట్లను గుడి నిర్వాహకులు కొనుగోలు చేయడానికి ప్రతిపాదించారు. రేట్ల విషయంలో తేడా రావడంతో రైతులు తమ భూమిని ఇవ్వలేదు. వైసీపీ హయాంలో కొందరు నేతలను అడ్డం పెట్టుకుని ఈ భూమిని ఆక్రమించేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తమకు జరిగిన అన్యాయాన్ని జిల్లా అధికారులకు తెలియజేశారు. ఆర్డీవో విచారించాక.. తహసీల్దార్, సీఐతో కలిసి రైతులకు భూములను స్వాధీనం చేశారు. ఆ భూముల్లో కొబ్బరిమొక్కలను ఈఏడాది ఏప్రిల్ నెలలో నాటుకున్నారు. ఈ నేపథ్యంలో గుడి నిర్వాహకులు హైకోర్టు ఉత్తర్వులు తమకు అనుకూలంగా వచ్చాయని చెప్పి.. పొలాల వద్ద ఎవరూ లేని సమయంలో ఎక్స్‌కవేటర్‌తో కొబ్బరి మొక్కలను తొలగించారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు తెలియజేయడానికి వెళితే ఆయన అందుబాటులో లేకపోవడంతో గంగాధరనెల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ ఘటనపై తహసీల్దార్ శ్రీనివాసులును సోమవారం వివరణ కోరగా.. తాను ఈ మండలానికి కొత్తగా వచ్చానని వివరాలు తెలియదన్నారు. సిబ్బందిని పంపించి మంగళవారం వివరాలు తెప్పించుకుంటామన్నారు. సీఐ శ్రీనివాసంతిని వివరణ కోరగా.. అంకాళపరమేశ్వరి గుడి నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించగా వారికి కోర్టు అనుకూలమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. ఆ భూములు పట్టాభూములని.. గుడికే చెందుతాయని, తగాదాలు చేస్తే రైతులపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులుంటే హైకోర్టును ఆశ్రయించాల్సిందిగా తాను వారికి సూచించామన్నారు. అనవసరంగా సివిల్ తగాదాల్లోకి రాకూడదని చెప్పామన్నారు.

బాధితులకు న్యాయం చేయండి: కమిషనర్



స్థానికురాలితో మాట్లాడుతున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి అర్జీలను కమిషనర్ స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవాటిని క్షేత్రస్థాయి కెళ్లి పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. 12 అర్జీలు రాగా.. ఇంజనీరింగ్‌కు 8, రెవెన్యూకు 2, హెల్త్‌కు 1, పింఛన్‌కు ఒక అర్జీ చొప్పున ఉన్నాయి. ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ పాల్గొన్నారు.

ప్రజలకు పక్కాగా నీటి సరఫరా: ప్రజలకు నీటి సరఫరా పక్కాగా చేయాలని కమిషనర్ ఆదేశించారు. సోమవారం కొంగారెడ్డిపల్లెలోని ఈఎస్ఎల్ఆర్ ట్యాంకును తనిఖీ చేశారు. ట్యాంకును క్రమం తప్పకుండా శుభ్రం చేస్తున్నారా అని ఆరా తీశారు. మోటార్ల పనితీరును ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వెంకటేశ్వర కాలనీ, చెన్నారెడ్డికాలనీ వాసులతోనూ మాట్లాడి, నీటి సరఫరాపై ఆరా తీశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: టీడీపీ



వేల్కూరు ఇందిరానగర్‌కాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. వేల్కూరు, పెద్దకాల్వ పంచాయతీల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, జిల్లా తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రాంబాబురెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, నియోజకవర్గ కమ్మవారి వైభవం అధ్యక్షుడు దీపక్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐరాల సింగిల్ విండో అభివృద్ధికి పాటుపడతా

● నూతన చైర్మన్ శేషాద్రినాయుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న శేషాద్రినాయుడు

ఐరాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఐరాల సింగిల్‌విండో అభివృద్ధికి పాటుపడతానని నూతన చైర్మన్ శేషాద్రినాయుడు తెలిపారు. సింగిల్ విండో కార్యాలయంలో సోమవారం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అలాగే డైరెక్టర్లుగా 35యర్లపల్లెకు చెందిన ఎస్.శ్రీనివాసులు, మలారపల్లెకు చెందిన ఎం.సుబ్రహ్మణ్యం కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. తాను రైతు బిడ్డనని, రైతులందరికీ ఉపయోగపడే నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన్ను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్మెంట్ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, మాజీ జడ్పీటీసీ లత, రంజిత్‌రెడ్డి, లోకనాథరెడ్డి, మాజీ డైరెక్టర్ ప్రహ్లాదనాయుడు, దేవరాజ్, నటరాజ్ పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతి



సాంబశివ నాయుడు (ఫైల్ ఫొటో)

గుడిపాల జూలై 21 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండల టీడీపీ మాజీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీటీసీ తుమ్మల సాంబశివ నాయుడు(63) సోమవారం రాత్రి మృతి చెందారు. ఈయన టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. మూడు, నాలుగు రోజులుగా జ్వరం రావడంతో తిరుపతిలోని స్విమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన మృతి పట్ల టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవులునాయుడు, హేమాద్రి నాయుడు, బాలాజీ నాయుడు, నాగరాజు యాదవ్, గొల్ల హరిప్రసాద్ చౌదరి, చంద్రమోహన్, మురళి నాయుడు, గోపి, రామ్మూర్తినాయుడు సంతాపం తెలిపారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



భువనేశ్వరికి చెక్ అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మృతి చెందిన ప్రదీప్‌కుమార్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం చేసింది. స్థానిక పోలీసు అతిథి గృహంలో ప్రదీప్ భార్య భువనేశ్వరికి ఐడీఆర్ఎఫ్ ఫండ్ కింద రూ.లక్ష చెక్కును సోమవారం ఎస్పీ మణికంఠ అందించారు. పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఫసల్ బీమా'ను సద్వినియోగం చేసుకోండి

వెదురుకుప్పం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పీఎం ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి సి.వనిత సోమవారం తెలిపారు. వరి పంటకు మండలం యూనిట్‌గా తీసుకుని ఎకరాకు రైతులు రూ.840 చెల్లించాలని పంట నష్టపోతే రూ.42వేలను బీమావారు చెల్లిస్తారని తెలిపారు. దీనికి ఆగస్టు 15వ తేదీవరకు గడువు ఉందన్నారు. వేరుశనగ పంటకు ఎకరాకు రూ.260 చెల్లిస్తే.. బీమా కంపెనీవారు రూ.28వేల నష్టపరిహారం చెల్లిస్తారని తెలిపారు. దీనికి ఈనెలాఖరు వరకు గడువుందన్నారు.

మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

● అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్



వెదురుకుప్పం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): 'అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కోశాధికారి ఎస్.లక్ష్మీనరసమ్మ డిమాండ్ చేశారు. సోమవారం కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ యాప్స్ రద్దు చేయాలని, వేతనాలను పెంచాలని కోరారు. అనంతరం ఆ కార్యాలయంలోని డేటా ఎంట్రీ ఆపరేషర్ ఉమకి వినతిపత్రాన్ని అందజేశారు.

'స్పాట్' రెమ్యూనరేషన్ చెల్లించాలి: పీఆర్‌టీయూ

చిత్తూరు సెంట్రల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాకనం (స్పాట్) చేసినవారికి రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కన్నన్, విజయభాస్కర్ రాష్ట్ర విద్యాశాఖను కోరారు. ఇన్‌సర్వీసులో బీఎడ్ కోర్సు చేస్తున్న ఎస్జీటీ టీచర్ల స్థానాలు ఖాళీగా చూపడంతో జూన్,జూలైనెలల జీతాలు బిల్లులను ఎంఈవోలు పెట్టడం లేదన్నారు. దీనిపై తగు సూచనలివ్వాలని ఒక ప్రకటనలో కోరారు.

పంచాయతీ కార్యదర్శులు కావలెను!

● పాలసముద్రం మండలంలో
13 పంచాయతీలుంటే పనిచేసేది ఐదుగురే

పాలసముద్రం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో 13 పంచాయతీలుండగా ప్రస్తుతం ఐదుగురు కార్యదర్శులే విధులు నిర్వహిస్తున్నారు. ఉన్న కార్యదర్శులే రెండు,మూడు పంచాయతీల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఎస్ఆర్ ఆర్‌కండ్రిగ, కృష్ణజిమ్మాపురం,పాలసముద్రం,ఆముదాల, నరసింహాపురం పంచాయతీలకు మాత్రం రెగులర్ కార్యదర్శులు ఉన్నారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడినుంచి బదిలీపై వెళ్లిన కార్యదర్శుల స్థానంలో కొత్తవారు రాకపోవడంతో వనదుర్గాపురం, శ్రీకావేరిరాజుపురం, సింహరాజుపురం, వెంగళ్రాజు కుప్పం, బాలకృష్ణాపురం, తిరుమలరాజుపురం, కోదండరామాపురం, గంగమాంబాపురం పంచాయతీలకు కార్యదర్శులస్థానాలు ఖాళీగా ఉన్నాయి. కలెక్టర్ స్పందించి ఈస్థానాలను భర్తీ చేయాలని సర్పంచులు, స్థానికులు కోరుతున్నారు.

సహ చట్టంపై అవగాహన పెంచుకోండి

గుడిపాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు (సహ) చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో శిరీష సూచించారు. సోమవారం తన కార్యాలయంలో సహ చట్టంపై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సచివాలయ ఉద్యోగులు, సూపరింటెండెంట్ కుమార్, పీఆర్ ఏఈ ప్రసాద్‌నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ఎంపీడీవో సమావేశపు మందిరంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు సహచట్టంపై అవగాహన సమావేశాన్ని ఎంపీడీవో పురుషోత్తం నిర్వహించారు. ఏవో నాగమణి, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో కోదండరామిరెడ్డి, వ్యవసాయాధికారి సి.వనిత, ఏపీఎం పరశురామిరెడ్డి పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

● ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు



నిందితుడి వివరాలను తెలియజేస్తున్న డీఎస్పీ ప్రభాకర్

బంగారుపాళ్యం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. అతడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 14వ తేదీన తుంబకుప్పం దళితవాడకు చెందిన రామ్‌విలాస్ పాశ్వాన్‌ను విరూపాక్షపురం గ్రామానికి చెందిన అబ్దుల్ మాలిక్ కుమారుడు అహ్మద్ బాషా కత్తితో దాడిచేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమవారం తుంబకుప్పం క్రాస్‌వద్ద అహ్మద్‌బాషాను అదుపులోకి తీసుకున్నారు. నిందిడుడిపై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ కత్తి శ్రీనివాసులు, ఏఎస్ఐ మల్లప్ప, వీఆర్వో శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నందీశ్వరుడికి రుద్రాభిషేకం

వెదురుకుప్పం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి సోమవారం రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ● ఎగువ కన్నికాపురం వద్ద ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.

విద్యాసామగ్రి వితరణ



బంగారుపాళ్యం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మొగిలిమిట్టూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈశ్వర్ కళ్యాణ్ అభయాట్రస్టు ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, జామెట్రీ బాక్స్‌లను నిర్వాహకులు ఈశ్వర్‌నాయుడు, మమత, కళ్యాణ్ సోమవారం వితరణ చేశారు. అలాగే టేకుమంద, జయంతి, కీరమంద, కొదలమడుగు, ఎగువరాగిమానుపెంట, దిగువ రాగిమానుపెంట, వెలుతురుచేను, డీకే చెరువు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కూడా విద్యాసామగ్రి అందజేశారు. మాధవనాయుడు, ఎంఈవోలు నాగేశ్వర్‌రావు, రమేష్ బాబు, హెచ్ఎం చంద్రిక, ఉపాధ్యాయులు రఘుపతినాయుడు, రవి, హరి పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు

పాలసముద్రం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో 65 ఏళ్లు నిండిన వృద్ధులందరికి వారి ఇంటి వద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని డీలర్లను తహసీల్దార్ అరుణకుమారి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో చౌకదుకాణం డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీటీ రిషివర్మ, ఆర్ఐ దేవి, డీలర్లు పాల్గొన్నారు.

పేదలకు స్వీట్లు పంపిణీ



బంగారుపాళ్యం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు బీసీ రవీంద్రనాయుడు జన్మదినం సందర్భంగా పేదలకు స్వీట్లు పంపిణీ చేశారు.సోమవారం మార్కెట్ యార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగరాజు నాయుడు, శివ, చలపతి, గిరి,హర్ష, యాసిన్, కృష్ణమూర్తి, జాకీర్,సౌందర్‌రాజ్ పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టుపై వైసీపీ నిరసన

చిత్తూరు అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుకు వ్యతిరేకంగా గాంధీ విగ్రహం వద్ద వైసీపీ శ్రేణులు సోమవారం నిరసన తెలిపాయి. చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి, నేతలు కేపీశ్రీధర్, చంద్రశేఖర్, జ్ఞానజగదీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తవణంపల్లెలో మాజీఎమ్మెల్యే సునీల్‌కుమార్, వెదురుకుప్పం, గంగాధరనెల్లూరులో వైసీపీ శ్రేణులు నిరసన తెలిపాయి.

ఆధారాలు లభించాకే ఎంపీ అరెస్టు : టీడీపీ

వెదురుకుప్పం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): 'మద్యం స్కామ్‌లో విచారణ జరిపిన అధికారులు ఆధారాలు లభించాకే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారు. ఈ అరెస్టు సమర్థనీయం' అని కార్వేటినగరం మండల టీడీపీ ఉపాధ్యక్షుడు సోమశేఖర్ తెలిపారు. ఇది అక్రమ అరెస్టు అంటూ వైసీపీ నాయకులు రాజకీయ దుమారం రేపడం వారి అవివేకమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కందూరులో మహాభారత యజ్ఞం

సోమల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కందూరులో మహాభారత యజ్ఞం సందర్భంగా సోమవారం పంచపాండవ విగ్రహాలకు ఆలయ ధర్మకర్త శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. భాగవతారిణి గీతాశ్రీ పాండవ విద్యాభ్యాసం కథను భక్తులకు వినిపించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

గంగాధరనెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె సమీపంలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై సోమవారం సాయంత్రం సీఐ శ్రీనివాసంతి దాడిచేశారు. నిర్వాహకురాలు విజయతోపాటు ముగ్గురు మహిళలను, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకుని పోలీస్టేషన్‌కు తరలించారు.